ఈ వారం కథ

# నాంది

– నరిశేపల్లి లక్ష్మీనారాయణ

'అప్పలకొండ'

'సార్'

'పద్మావతిని పిలు'

'అమ్మగోరూ...'

'ఉ...'

'అయ్యగోరు పిలుత్తున్నారండి'

'నాన్సెన్స్ ఏమిటా సంబోధన. నన్ను అమ్మగారంటూ నా వద్ద 'అయ్యగారు పిలుస్తున్నారు' అంటే ఇంజనీరుగారు 'మా ఆయనగారు' అన్న అర్థం వస్తుంది. 'మనిషికో మాట, పశువుకో దెబ్బ' అన్నారు. 'మిమ్మల్ని సార్ పిలుస్తున్నా డంటూ పిలవమని ఎన్నిమార్లు చెప్పాలి. మరోమారలా పిలి చావంటే నీ నాలిక పేలికలౌతుంది'


'తప్పై పోనాదమ్మగోరూ. అలవాట్లో పొరపాటు. సమిం చండి'

ఆమె అప్పలకొండవైపు గుడ్లురిమి చూసి విసావిసా వెళ్ళి పోయింది. గోడకేసి కొట్టిన బంతిలా వెంటనే వెనుదిరిగి సీటు వద్దకొచ్చేసింది.

'అమ్మగోరూ, ఏటంట?' ఆదుర్దాగా అడిగాడు అప్పల కొండ.

'ఏముంది. పదిమంది టైపు చేయాల్సిన కాగితాలు, ఎస్టిమేట్లు నా నెత్తిన రుద్ది 'ఇంకా టైప్ కాలేదా? ఇంత ఆల స్యమైతే ఎలా?' అంటూ కేకలేయటం తెలుసు కానీ, పండక్కు అడ్వాన్సుకు పెట్టుకున్న అప్లికేషన్‌కు మటుకు అతీగతీలేదు' అంది పద్మావతి.

'బాగా సెప్పారమ్మగోరూ. ఇంజనీరు దొరగారికి దయా దాచ్చిన్యాలు బొత్తిగా లేవండి. ఆరిది రాతిగుండె. నా పండ గడ్వాన్స్ అర్జీ కూడా దర్జాగా దొరగారి టేబిల్ మీద నిద్దరో తోంది. పొద్దుటి నుండీ సాయంకాలం దాకా ఆపీసులో సాకిరీ సేసి మరల దొరగారి ఇంటికెల్లి అక్కడా రేతిరి తొమ్మి దింటిదాకా అమ్మగోరు సెప్పే పన్లన్నీ దేకి గూడుసేరేసరికి ఏ పదిగంటలో దాటతాది. పురుసొత్తికి లేకుండా దినామూ అంత గొడ్డు సాకిరీ సేసినా, ఏలాపాలా లేకుండా దొరగారె మ్మడి



కాంపులు తిరిగినా ఏదండమ్మగోరూ నా టి.ఏ. బిల్లులు, ఆటికింతవరకు మోచ్చమే లేదాయే! ఎంత అడుక్కున్నా నా గోడు 'సేవిటోడి ముందు సెంకూదినట్టు' నిస్పయోజనమై పోనాది' అన్నాడు అప్పలకొండ. 'పిల్లా జెల్లా ఉంటేగా అవ సరాలూ అవీ తెలిసేది. ఇంటికి పోగానే బ్రిటానియా బిస్కెట్ పాకెట్ ఇవ్వకపోతే పెద్దోడు సురేష్ ఇల్లు పీకి పందిరేస్తాడు. కనీసం నాలుగు న్యూట్రిన్ చాక్లెట్లైనా చేతిలో పెట్టకపోతే చిన్నోడు చిదానంద్ చిర్రుబుర్రుమంటాడు. వాడి మారాముకు అంతే ఉండదు. 'ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసిన చోటనే' అన్నట్టు, నా ఇంక్రిమెంటు అరియర్ బిల్లు అక్కడే ఇంజనీరు గారి టేబిల్ మీద అలాగే ఉండిపోయింది' నిట్టూర్చింది సీనియర్ క్లర్క్ సునంద. 'ఎన్నైనా సెప్పండి సునందమ్మగోరూ, ఇంజనీరు దొరగారు అందరితోను ఆపీసు పని సేయించుకోటంలో పట్టు. బిల్లులూ గిల్లులూ పాసుసేయటంలో లాట్టు' అన్నాడు అప్పలకొండ.

'ఏం చేస్తాం అంతా ఖర్మ' అంది సునంద ఐదవటంతో ఇంటికి బయలుదేరుతూ.

★ ★ ★

'ఏమండీ ఆరు కావస్తోంది. ఇప్పుడేం క్యాంపండీ? ఐదు గంటలవగానే ఆఫీసు నుండి రావటం, ఆరుకల్లా ఇల్లు వదలటం, మరల రాత్రి ఏ తొమ్మిదికో పదింటికో రావటం మీకు పరిపాటైంది. పది గంటలపైన భోజనం. రోజూ ఇలాగైతే మీ ఆరోగ్యం ఏం కాను? ఈ పద్ధతి మంచిది కాదండీ' మందలించింది భానుమతి. ఎంత పెద్ద ఉద్యోగైనా సాయంత్రం ఆరుగంటలకల్లా ఇంటి పట్టున ఉండాలన్న తన మామూలు మాటను మరో మారు హెచ్చరిస్తూ.

'ఏం చెయ్యమంటావే. పగటి పూట నేను ఆఫీసు చెక్కేసి క్యాంపు వెడితే సిబ్బంది పని చేస్తుందనుకున్నావా? ఆ రోజంతా, ఆఫీసులోను క్యాంటీన్‌లోను కబుర్లతో కాలక్షేపం; నేను ఐదు వరకూ ఆఫీసులో టంచన్‌గా ఉంటేనే ఆ మాత్రం ఫైళ్ళు నా టేబిల్ మీదికొస్తాయి. నేనే గనుక లేకపోతే వాళ్ళు పని చేస్తారనుకున్నావా? ఎక్కడి ఫైళ్ళు అక్కడే. వాళ్ళకు లోన్లు, అడ్వాన్సుల మీద ఉండే శ్రద్ధాసక్తులు ఆఫీసు పని మీద ఉండవు. అందుకే ఉదయం పది నుండీ సాయంత్రం ఐదింటి దాకా బిల్లలా ఆఫీసునే అంటి పెట్టుకొని వారి మీద ఆ నిఘా' అన్నాడు సత్యారావు. ఆయనకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పదోన్నతి లభించి రెండేళ్ళు కావస్తోంది.

'ఏమోనండీ మీకు కష్టం అనిపించనపుడు మీ ఇష్టం. అన్నట్టు లోన్లు, అడ్వాన్సులంటే జ్ఞాపకమొచ్చింది. మీరు టి.ఏ. బిల్లులు సైన్ చేయలేదని, పండక్కు అడ్వాన్సు మంజూరు చేయలేదని డ్రైవర్ సింహాచలం, అటెండర్ అప్పలకొండ మొన్న నా వద్ద మొత్తుకున్నారండీ'

'నీకేం తెలుసు. అవి మంజూరు చేస్తే మాట లెక్కువవుతాయి. నాకు దయాదాక్షిణ్యాలు లేవట. నా గుండె పాషాణమట. కనీసం జీతం బిల్లులు సంతకాలు చేస్తున్నందుకైనా వారు సంతోషించాలి. వెధవలు బలిసిపోయారు' బయటికి అడుగులేసి జీపు ఎక్కాడు సత్యారావు. జీపు స్టార్టైంది.

★ ★ ★

'సార్'

'ఏమిటి?'

'అర్జంటుగా ఓ వంద రూపాయలు కావాలి సార్. ఇంజనీరు దొరగారు నా టూర్ అడ్వాన్స్ బిల్లు సంతకం చేయగానే ఆ మొత్తంలో పట్టుకోండి' అన్నాడు జీపు డ్రైవర్ సింహాచలం.

'ఇచ్చేవాడినే కానీ దొరగారు ఆఫీసు పర్మనెంట్ అడ్వాన్స్ బిల్లు కూడా అప్రూవ్ చేయలేడు. బిల్లుల్ని ఎప్పటికప్పుడు సైన్ చేస్తేగా ఆఫీసులో నాలుగు డబ్బులు రొటేషన్‌లో ఉంటాయి. ఇ.ఇ.గారి టేబుల్ మీద మన బిల్లులు పెండింగున్నా ఫరవాలేదు గానీ ఆఫీసు ఫైళ్ళు మాత్రం సిబ్బంది టేబుళ్ళ మీద పెండింగ్ ఉండకూడదన్నది ఆయన అభిమతం. ఇదిగో ఈ యాభై ఉంచు' అన్నాడు సూపరింటెండెంట్ గోపాలం.

'సార్ మీరు చెప్పింది సెంట్ పర్సెంట్ కరెక్ట్. నా ఎడ్యుకేషన్ లోన్ బిల్లూ ఇ.ఇ.గారి వద్ద రెస్టు తీసుకుంటోంది. స్కూల్స్ ఓపెన్ చేసే టైం. పిల్లలకు ఫీజులు వగైరా' గళం విప్పాడు సీనియర్ డ్రాఫ్ట్సమన్ గరుడయ్య.

సూపరింటెండెంట్ కాసేపు మౌనం వహించాడు.

'అన్నట్టు, సింహాచలం నీవు ఇ.ఇ.గారిని రోజూ క్యాంపునకు తీసికెడుతుంటావుగా. నీవు చెబితే దొరగారు ఎంత దూరం పెడతారు' అడిగాడు సూపరింటెండెంట్.

'లాభం లేదు సార్. చెప్పి చెప్పి బేజారైంది. నా గోడు అరణ్య రోదనగా మిగిలింది. హమేషా హైరానా ఎందుకని అడగటం మానుకున్నాను'

'పోనీ అమ్మగారికో మాట చెప్పకూడదూ. అలా ఐనా మన కడగండ్లు తీరతాయేమో' సూపరింటెండెంట్ సూచన ప్రాయంగా అన్నాడు.

'అదీ ఐపోయింది సార్. అమ్మగారిని కేకలేశాడట.

ఆఫీసు విషయాల్లో జోక్యం చేసుకుంటే, సెకండ్ సెటప్ ఏర్పాటు చేసుకుంటానని దొరగారు అమ్మగారిని బెదిరించారట. దాంతో అమ్మగారు నీరు చల్లిన నిప్పులా చల్లబడ్డారు'

'అందరి ఆశలు ఆ బిల్లుల మీదే. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆగిపోకముందే ఇ.ఇ.గారు వాటి మీద ఆకుపచ్చ సిరాను తొణికిస్తే బాగుంటుంది. ఐతే అదెప్పుడు అన్నది కాలమే నిర్ణయించాలి' గొణుక్కుంటూ తన సీటు వద్దకెళ్ళాడు గురుడయ్య.

★ ★ ★

అసుర సంధ్యలో రోడ్ల తనిఖీ ముగించి జీపు ఎక్కాడు ఇ.ఇ. తిరుగుముఖం పట్టేసరికి చీకటి పడింది. తన లైట్ల వెలుగుతో చీకటిని చీల్చుకుంటూ జీపు ముందుకు దూసుకుపోతోంది. అరగంట గడిచింది. సడెన్ బ్రేక్ వేశాడు సింహాచలం. అతడి అంతరంగంలో ఒకేమారు ఆందోళన, ఆశ్చర్యం ఆవిర్భవించాయి. 'ఒరేయ్ అప్పలకుండ' అతను ఆదుర్దాగా అరిచాడు.

'ఆ' ఆవలిస్తూ స్పందించాడు అప్పలకొండ.

'ఇంజనీరు దొరగారేరీ?'

ఉలిక్కిపడి సీటువైపు చూశాడు అప్పలకొండ.

ఇ.ఇ.గారు లేరు. కాస్త కలవరపడ్డాడు.

'నాకేటి తెలుసు. నీవు ఆరి పక్కనే ఉన్నావు. నీకే తెలవాలి'

'జీపు డ్రైవ్ చేసేటప్పుడు నా దృష్టి అంతా డ్రైవింగ్ మీదే ఉంటుంది. నీవు దొరగారి అటెండర్‌వి. దొరగారిని ఓ కంట కనిపెట్టుకు కూచోవాల్సిన బాధ్యత నీది'

'అది కాదు సింహాసెలమూ, కాసింత కునుకు పడితేను'

'మరేమీ మాటాడకు. జరిగిందేదో జరిగిపోయింది. దొరగారి నెతుకుదాం పద' జీపు నెమ్మదిగా రివర్సులో నడవసాగింది. చుట్టూ కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటి. ఎటూ ఏమీ అగుపించటంలేదు. కొంతసేపటికి ఏవో మూలుగులు వినిపించసాగాయి.

'అక్కడెవరో ఉన్నట్టున్నారు' జీపు నిలిపాడు సింహాచలం. రెండడుగులు ముందుకేసి 'ఎవరక్కడ' అని అరిచాడు.

'ఒరేయ్ సింహాచలం, నేనేరా!' అన్నాడు ఇ.ఇ.

'అమ్మో, ఓలమ్మో ఎంత పనైపోనాది. దొరగారు గుంతలో పడిపోనారు' అన్నాడు అప్పలకొండ.

'అబ్బా... అమ్మో' మూలుగుతున్నారు ఇ.ఇ.

'సీకటి పడే యేలల్లో కాంపు లొద్దంటే ఇన్నారా? ఇపుడేటి సెయ్యటము?'

'దొరగారి చేతులు పట్టుకొని పైకి లాగటమే'

'ఒరే, ఇంకా మీనమేషాలు లెక్కపెడ్తున్నారేమిరా. అబ్బా... అమ్మో... పైకి లాగండ్రా'

'అప్పలకొండా నీ వొక చెయ్యి పట్టుకో. నేనొక చెయ్యి పట్టుకుంటా'

'అట్టాగే. అన్నట్టు సింహాసెలమూ, దొరగారు నీ టూరడ్వాన్సు బిల్లు, పండక్కి అడ్వాన్సు కెట్టుకున్న బిల్లు సంతకాలెట్టేదన్నావు, కాదేటి?'

'అవున్రా అప్పలకొండా! మరి నీ టి.ఏ. బిల్లుల మాటేమిటి? అవీ సంతకం కాలేదుగా'

'ఎ...ఎ.'

'ఒరే త్వరగా పైకి లాగండ్రా. మీ బిల్లులన్నీ సంతకాలు పెడతానురా' కేకేశారు ఇ.ఇ.

'అప్పలకొండా'

'ఏటి?'

'దొరగారు రాత్రిళ్ళు క్యాంపు లేసుకోటం వల్లే కదా ఇలా జరిగింది'

'కాదేటి?'

'ఒరే, ఇకపై సాయంత్రంపూట క్యాంపులు మానేస్తానురా. పైకి లాగండ్రా మీ పని చెబుతాను'

'దొరగారికి కోపం వచ్చింది. పైకి వస్తే ఏం చేస్తాడో, ఏమో' నసిగాడు సింహాచలం.

'నసిపెండు సేత్తాడో ఏటో'

'మిమ్మల్నేమీ చేయనురా, లాగండ్రా' మూల్గుతూ అన్నారు ఇ.ఇ.

'సింహాసెలమూ, ఈ ఇసయం అమ్మగోరికి తెలిత్తే సింతపడతది'

'ఒరే, మీకు పుణ్యముంటుందిరా, మీ అమ్మగారితో చెప్పకండ్రా. త్వరగా పైకి లాగండ్రా' హీన స్వరంతో పలికారు ఇ.ఇ.


జీపు స్టార్టైంది. సురక్షితంగా ఇల్లు చేరాడు ఇ.ఇ.

★ ★ ★

మరుసటిరోజు ఉదయం పది గంటలకల్లా సిబ్బంది పండగడ్వాన్సు బిల్లులు, టి.ఏ. బిల్లులు, టూర్ అడ్వాన్సు బిల్లులు, ఇంక్రిమెంటు అరియర్ బిల్లు, ఎడ్యుకేషన్ లోన్ బిల్లు, పర్మినెంట్ అడ్వాన్స్ బిల్లు, ఏ ఒక్కటీ పెండింగు లేకుండా అన్నీ ఇ.ఇ.గారి సంతకాలై సూపరింటెండెంట్ గోపాలం టేబిల్ మీదున్నాయి. అందరి గుండెల్లోను ఆనందం తాండవించింది. అప్పటి నుండి ఇ.ఇ. క్యాంపులు పగలే. ఇ.ఇ. దొరగారిలో వచ్చిన మార్పుకు నాంది ఏమిటో అటు ఆఫీసులో సిబ్బందికీ, ఇటు ఇంట్లో ఇల్లాలికీ ఎవరికీ అర్థంకాలేదు. అడపాదడపా ఒకరినొకరు చూసుకొని ముసి ముసి నవ్వులు నవ్వుకొంటూ, లోలోన మురిసిపోయే సింహాచలం అండ్ అప్పలకొండలకు తప్ప.

★

## యస్..బాస్..!




(6 వ పేజీ తరువాయి)

హిరోషిమా నుంచి రైల్లో నాగసాకికి వచ్చిన ఆ అణుబాంబు బాధితుడికి డాక్టర్లు హుటాహుటిన వచ్చి కట్లు కట్టారట...! దురదృష్టం ఏమిటంటే... ఆ మర్నాడు నాగసాకి మీద కూడా మరో అణుబాంబు 'ప్రయోగం' జరిగింది...!! మరీ విచిత్రం ఏమిటంటే... ఈ బాంబు పడినా కూడా 'ఆ పేషెంట్' బతికే వున్నాడు...!! వంటికి కట్టిన గాజు గుడ్డల్ని మామూలుగా వూడదీస్తే ఒకంతట రావట... కానీ ఆ బాంబు శబ్ద తరంగాల తీవ్రతకి ఆ కట్లన్నీ 'లిప్తలో' వూడిపోయాయట...!! ఈ రెండు బాంబుల విధ్వంసంలోనూ అతను మృత్యువాత పడకపోగా... నిన్న మొన్నటి వరకూ... జీవించే వున్నాడట...!!

అతని మీద జపనీస్ డాక్టర్లు చాలా ఎక్స్‌పెరిమెంట్స్ చేశారు.

రేడియో ధార్మిక శక్తివల్ల ప్రాణికి ఎంత నష్టం జరుగుతుందో దానికి అతను ప్రత్యక్షసాక్షి...!!

అతని మీద పరీక్షలు చాలవన్నట్లు ఆ మధ్య ఇంగ్లండ్‌లో... కొంతమంది శాస్త్రజ్ఞులు పంజాబీ స్త్రీలకు వాళ్ళకు తెలియకుండా 'రేడియో ధార్మిక లవణాలని' పరోటాల్లో... పూరీల్లో కలిపి తినిపించారట...!

ఈ 'బలవంతం ప్రయోగం' 35 ఏళ్ళ క్రితం 1969 సం.లో జరిగినా బయటపడింది మొన్న...! ఆసియావాసులంటే... 'తెల్లదొరలకి' కేవలం 'గయానా పందుల్లాగా' కనిపిస్తున్నారా...?! దీనికి నిరసన తెలియపర్చింది మన ప్రభుత్వం...!

'దొంగలు పడ్డ ఆర్నెల్లకు...' అన్నట్టయింది ఆ పరిస్థితి...!

ఏదో మారుమూల ప్రపంచానికి తెలియకుండా 'ఇలాంటి ప్రయోగాలు' జరుగుతూనే ఉన్నాయి...! అయినా 600 కోట్ల జనాభాలో... 'ఓ కాస్త మంది ఇలా చిత్రహింసల పాలై... 'పోతే'... లెఖ్ఖేమిటి...?!

★